సాక్షి
సంగారెడ్డి
7
శుక్రవారం | 28 | జూన్ | 2024

మబ్బుల దోబూచులు

వానాకాలం సీజన్ ప్రారంభమై ఇరవై రోజులు దాటినా వరుణుడి కరుణ లేదు. విత్తనాలు నాటి రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. సంధ్య వేళ మబ్బులు కమ్ముతున్నా చినుకు రాలడం లేదు. ఝరాసంగం మండల పరిధిలోని చిల్లపల్లి గ్రామ శివారులో గురువారం సాయంత్రం ఇలా దట్టమైన నల్లని మబ్బులు కమ్మినా వాన జాడ లేదు.

ఝరాసంగం(జహీరాబాద్):



న్యూస్‌రీల్

వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని వినతి

సంగారెడ్డి టౌన్ : నిమ్జ్‌లో భూమిలేని వ్యవసాయ కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం కార్యవర్గ సభ్యులు అతిమోల మాణిక్యం డిమాండ్ చేశారు. గురువారం కూలీలతో కలిసి కలెక్టరేట్‌లో ఏఓ పరమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం, న్యాల్కల్ మండలాల్లోని 12,600 ఎకరాల భూములను నిమ్జ్ కోసం ప్రభుత్వం సేకరిస్తుందని, దీంతో వ్యవసాయ కూలీలు పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. వారికి వెంటనే పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

నెలలోనే పింఛన్ పత్రాలు



పింఛను మంజూరు పత్రాలను అందజేసిన విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు టౌన్ : ప్రతీ నెల ప్రయాస్ పథకంలో భాగంగా పదవీ విరమణ పొందిన నెలలోనే, చందాదారులకు పింఛను పత్రాలను మంజూరు చేస్తున్నట్లు ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ తెలిపారు. గురువారం మదీనగూడలోని మై హోమ్ జువెల్ అపార్ట్‌మెంట్ టవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంగణంలో జూన్‌లో 35 మందికి పింఛన్లు మంజూరు కాగా.. ఇందుకు సంబంధించి పత్రాలు 14 మందికి అందజేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కన్నా సెక్షన్ సూపర్‌వైజర్ జానకి రామారావు, మై హోమ్ జువెల్ అపార్ట్‌మెంట్ టవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సంగారెడ్డి టౌన్ : గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి.. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో డీపీఓ, ఏఓలకు వినతి పత్రం అందజేశారు.

భూ సర్వే ముమ్మరం



భూ సర్వే నిర్వహిస్తున్న అధికారులు

హత్నూర(సంగారెడ్డి): రీజినల్ రింగ్ రోడ్ కోసం హత్నూర మండలం దేవులపల్లి గ్రామ పరిధిలో గురువారం భూ సర్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామ శివారులోని సర్వే నంబర్ 100లోని ఎకరా 28 గుంటలలో రోడ్డుకు ఎంత భూమి అవసరమనే దానిపై సర్వే చేపట్టారు. ఆగస్టులో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. ట్రిపుల్‌ఆర్ సంగారెడ్డి మేనేజర్ గోపాల్, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, సర్వేయర్లు సత్యనారాయణ, శ్రీనివాసులు ఉన్నారు.

టీబీ రహిత జిల్లాగా మార్చుదాం

సంగారెడ్డి టౌన్ : టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు సమన్వయంతో పనిచేయాలని జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ రాజేశ్వరి సూచించారు. గురువారం కలెక్టర్, డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు పట్టణంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణాలు, గ్రామాలలో టీబీపై విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ఇందుకోసం అంగన్‌వాడీ కార్యకర్తల సహకారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి జిల్లా అధికారులు రావాలి

సంగారెడ్డి టౌన్ : ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. గురువారం జిల్లా, మండలాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధరణి, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ధరణి సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన జరపాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రెడ్ కేటగిరీ విధ్వంసం

మృత్యువాత పడి లక్షలాదిగా గట్టుకు కొట్టుకు వచ్చిన ఈ చేపల దృశ్యం పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లోని పెద్ద చెరువులోనిది. పాశమైలారం పారిశ్రామికవాడలోని కాలుష్య కారక (రెడ్ క్యాటగిరీ) పరిశ్రమలు వర్షం నీటి మాటున కాలుష్య వ్యర్థజలాలను వదిలేయడంతో ఈ కాలకూట విషమంతా పెద్ద కాలువ ద్వారా చిట్కుల్ పెద్ద చెరువుకు చేరాయి. దీంతో చెరువులోని నీరంత విషంగా మారి సుమారు 30 టన్నుల చేపలు చనిపోయాయి. వీటితో చెరువులో ఉండే జీవజాతులు, పశుపక్షాదులు మృత్యువాత పడ్డాయి. కాలుష్య కారక పరిశ్రమల విధ్వంసానికి ఈ ఘటన ఒక నిదర్శనంగా నిలుస్తోంది.



చిట్కుల్ పెద్ద చెరువులో చనిపోయిన చేపలు

వర్షం నీటి మాటున పరిశ్రమల నుంచి వ్యర్థజాలాలు

- కలుషితమైన చిట్కుల్ పెద్ద చెరువు
- టన్నుల్లో మృత్యువాత పడిన చేపలు
- కాలుష్య కారక పరిశ్రమల అకృత్యాలు
- తీవ్రంగా నష్టపోయిన మత్స్యకారులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : కాలుష్య కారక పరిశ్రమలు నిబంధనలకు విరుద్ధంగా వదులుతున్న వ్యర్థజలాలతో ప్రకృతి విలవిలలాడుతోంది. వర్షం నీటి మాటున వదులుతున్న ఈ వ్యర్థజలాలతో స్వచ్ఛమైన చెరువులు, కుంటలు విషపూరితమవుతున్నాయి. దీంతో ఈ చెరువులపై ఆధారపడే ప్రాణకోటికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. పటాన్‌చెరు సమీపంలోని పాశమైలారం పారిశ్రామికవాడలో సుమారు 500 వరకు పరిశ్రమలున్నాయి. ఇందులో రెడ్ కేటగిరీ కింద బల్క్‌డ్రగ్స్, కెమికల్ పరిశ్రమలు వంద వరకు ఉంటాయి. వీటి వ్యర్థజలాలను యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా బయటకు వదలడం పరిపాటిగా మారింది. ఇలా పాశమైలారం పరిశ్రమలు వ్యర్థజలాలను బయటకు వదలడంతో అవి పెద్ద కాలువ ద్వారా చిట్కుల్ పెద్ద చెరువులోకి చేరుతున్నాయి. దీంతో 230 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో ఉన్న చేపలన్నీ మృత్యువాత పడ్డాయి. సోమవారం నుంచి ఒక్కసారిగా లక్షల్లో చేపలు చనిపోయి ఒడ్డుకు కొట్టుకువస్తున్నాయి. చనిపోయిన ఈ చేపలన్నీ నోరు తెరిచి ఉండటం చూస్తే కాలుష్య కారక వ్యర్థజలాలకే కారణమనేది స్పష్టమవుతోంది. ఈ గ్రామంలోని సుమారు వందకు పైగా మత్స్యకార కుటుంబాలు ఈ చెరువుపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాయి. చేపలు పట్టుకునే సమయంలో అవి చనిపోవడంతో మత్స్యకారులు కన్నీరు మున్నీరవుతున్నారు. సుమారు రూ.కోటికి పైగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిశ్రమలకు వంతపాడుతున్న అధికారులు

ఈ ఘటన విషయంలో పీసీబీ, మత్స్యశాఖ అధికారులు కాలుష్య కారక పరిశ్రమల యాజమాన్యాలను వెనుకేసుకొస్తుండటం తీవ్ర ఆరోపణలకు దారితీస్తోంది. ఈ ఘటనకు కాలుష్య జలాలు కారణం కాదంటూ దాటవేత ధోరణిని అవలంబిస్తుండటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఈ క్రమంలో పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, మత్స్యశాఖ అధికారులు ఒకరిపై ఒకరు నెట్టేసుకోవడం గమనార్హం.

చెరువులో ఆక్సిజన్ లెవల్స్ ఎందుకు పడిపోయాయి..?

చేపలు మృత్యువాత పడిన చిట్కుల్ పెద్ద చెరువు నీటి శాంపిల్స్‌ను సేకరించిన పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులు వాటిని ల్యాబ్‌లో పరీక్షించారు. చెరువు నీటిలో ఆక్సిజన్ (డిస్సాల్వుడ్ ఆక్సిజన్ డీఓ) లెవల్స్ తగ్గాయని తేల్చారు. ఆక్సిజన్ లీటరు 0.8 ఎంజీకి పడిపోయాయని, అందుకే ఊపిరాడక చేపలు చనిపోయాయని పీసీబీ తేల్చింది. అయితే ఎలాంటి కాలుష్య జలాలు ఈ చెరువుల్లోకి రాలేదని పీసీబీ అధికారులు తేల్చి చెబుతున్నారు. మత్స్యశాఖ అధికారులు మాత్రం ఉష్ణోగ్రత ఒక్కసారిగా పడిపోవడంతో చేపలు చనిపోయి ఉండవచ్చని అభిప్రాయ పడుతున్నారు. కాగా ఈ చెరువు సమీపంలోనే ఉన్న గుల్లకుంట, ఎర్రగుంట, గన్నెకుంటల్లోని చేపలకు ఎలాంటి నష్టం జరగలేదు. ఈ మూడు కుంటల్లో పడిపోని ఆక్సిజన్ లెవల్స్ ఈ పెద్ద చెరువులోనే ఎలా పడిపోతాయంటే అధికారులు నోరు మెదపడం లేదు. ఈ ఒక్క చెరువు వద్దే ఉష్ణోగ్రత ఎలా పడిపోతుందంటే మత్స్యశాఖ అధికారులు దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారు.

నీటిలో ఆక్సిజన్ లెవల్స్ పడిపోయాయి

పరిశ్రమల నుంచి కాలుష్య కారక వ్యర్థజలాలు వచ్చినట్లు మా దృష్టికి రాలేదు. చెరువు పరిసర ప్రాంతాలన్నింటినీ తిరిగి పరిశీలించాం. పాశమైలారం వైపు నుంచి వచ్చే కాలువ ద్వారా కూడా కాలుష్య జలాలు ఈ చెరువులోకి చేరిన దాఖలాలు కనిపించలేదు. ఆక్సిజన్ లెవల్స్ పడిపోవడంతో చేపలు చనిపోయి ఉండవచ్చు.

గీత సపారే,
ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్, పీసీబీ, సంగారెడ్డి

పీసీబీ రిపోర్టు ప్రకారం..

నీటిలో ఆక్సిజన్ లెవల్స్ తగ్గాయని పీసీబీ నివేదిక ఇచ్చింది. అందుకే చేపలు చనిపోయి ఉండవచ్చు. చెరువులో చేపల సంఖ్య కూడా ఎక్కువైందని మా దృష్టికి వచ్చింది. దీంతో సాంద్రత పెరిగి చనిపోయి ఉండవచ్చు. ఈ ఘటనపై ఇంకా పూర్తి స్థాయిలో పరిశీలన చేస్తున్నాం.

సతీష్, మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

కారణం తేల్చి.. మమ్మల్ని ఆదుకోవాలి



చేపలు చనిపోవడంతో వందకు పైగా మత్స్యకారుల కుటుంబాలకు తీవ్ర నష్టం జరిగింది. ఒక్కో చేప ఐదు కిలోల వరకు పెరిగింది. చేపలు పట్టుకునే టైంలోనే అవి చనిపోవడంతో మేము పూర్తిగా నష్టపోయాం. ఈ ఘటనకు గల కారణాలు అధికారులు తేల్చాలి. నిరుపేద మత్స్యకారుల కుటుంబాలకు పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– గ్యారల శ్రీనివాస్,
మత్స్యకార సంఘం నాయకుడు, చిట్కుల్

ట్రిపుల్‌ఆర్‌కు భూములివ్వం

- తప్పులతడకగా సర్వేలు
- పరిహారంపై భూనిర్వాసితుల ఆగ్రహం
- రోడ్డు నిర్మాణ అవగాహన సదస్సు బహిష్కరణ

జోగిపేట(అందోల్): రీజినల్ రింగ్ రోడ్డు మాకొద్దంటూ భూ నిర్వాసితులు తెగేసి చెప్పారు. గురువారం జోగిపేట ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ట్రిపుల్‌ఆర్ కింద భూములు కోల్పోతున్న రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. జోగిపేట ఆర్డీఓ పాండు, రీజినల్ రింగ్ రోడ్ మేనేజర్ అఫ్జల్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో చౌటకూర్ మండలం శివ్వంపేట, వెండికోలు, లింగంపల్లి, అంగడిపేట, కోర్పోలు గ్రామాల భూ నిర్వాసితులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభం కాగానే.. పరిహారంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్ల రూపాయల ధర పలికే భూములను తక్కువ ధరకు ఎలా ఇస్తామని అధికారులను నిలదీశారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం డబ్బులు చెల్లిస్తేనే భూములు ఇస్తామని స్పష్టం చేశారు. రోడ్డు నిర్మాణం కోసం చేపట్టిన సర్వే తప్పుల తడకగా ఉందని, కొందరు పూర్తి స్థాయిలో భూమి కోల్పోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి సర్వే చేయించాలని డిమాండ్ చేశారు. ఇలా అయితే మా గ్రామాల మీదుగా ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణం అవసరం లేదని, భూములు కూడా ఇవ్వమని రైతులు తేల్చి చెప్పారు. ఈ విషయంలో అధికారులు నచ్చజెప్పినా వినకుండా సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని ప్రకటించారు. భూసేకరణపై 50 మంది రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆర్డీఓ పాండుకు వినతిపత్రాలను అందజేశారు.

283 ఎకరాల సేకరణకు నోటీసులు

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి చౌటకూరు మండలం పరిధిలోని శివ్వంపేట, వెండికోలు, లింగంపల్లి, అంగడిపేట, కోర్పోలు గ్రామాల్లోని 283 ఎకరాలను సేకరించేందుకు 531 మందికి నోటీసులు జారీ చేసినట్లు ఆర్డీఓ పాండు సూచించారు. రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళతామని, తప్పనిసరిగా అవసరమైతే రీ సర్వే చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కువ మంది రైతులు భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేసారని ఆయన అన్నారు.



అధికారులను నిలదీస్తున్న రైతులు

భూమి లేకున్నా నోటీసు

సర్వే నంబరు 179లోని 2.15 ఎకరాల వ్యవసాయ భూమి రింగ్ రోడ్డు కింద పోతుందని నాకు నోటీసు పంపారు. ఇక్కడ నాకు సెంటు భూమి కూడా లేదు. తనకు వేరే చోట వ్యవసాయ భూమి ఉంది.

– సార శ్రీకాంత్, శివ్వంపేట గ్రామ రైతు

ఉన్న 11 గుంటల భూమి లాక్కుంటారా?

నాకు చౌటకూరు మండలం లింగంపల్లి గ్రామంలో సర్వే నంబరు 123లో 11 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఉన్నదంతా రోడ్డు తీసుకుంటున్నారు. నాకు వేరేచోట భూమిని కేటాయించాలి. పరిహారం కూడా ప్రస్తుతం ఉన్న ధర ప్రకారం చెల్లించడం లేదు.

– శంకరయ్య, రైతు లింగంపల్లి

సాగునీటి ప్రాజెక్టులపై పట్టింపేది?

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ పాలకులు పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం బసవేశ్వర ఎత్తిపోతల పథకానికి 1,774 కోట్లు, భూసేకరణకు నిధులు మంజూరుచేసి పరిహారం సైతం అందజేసిందన్నారు. తాను ఈమధ్యే నీటి పారుదలశాఖ అధికారులు, రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శిని కలిసి పనులు ప్రారంభించాలని కోరగా.. అందుకు వారు సానుకూలంగా స్పందించారన్నారు. బోరంచ ఎత్తిపోతల పథకానికి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.13 కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరాకూ నీరివ్వలేదన్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రుబీనానజీబ్, పరశురాం, విఠల్‌రావు, ముజమ్మిల్ ఉన్నారు.

చట్ట వ్యతిరేకులపై కఠిన వైఖరి

నారాయణఖేడ్: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ సూచించారు. ఖేడ్ డీఎస్పీ కార్యాలయంలో గురువారం సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో నేరాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిందితులను న్యాయస్థానాల్లో హాజరు పర్చాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలన కోసం గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే డ్రంకెన్‌డ్రైవ్, సైబర్ నేరాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. అంతర్ రాష్ట్ర జిల్లా చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. గతంలో గంజాయిసాగు, అక్రమ రవాణా చేసిన, అనుమానితులుగా ఉన్నవారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఖేడ్, కంగ్టి సీఐలు శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ రూపేశ్

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

డీసీహెచ్ఎస్ సంగారెడ్డి

నారాయణఖేడ్: వైద్యులు, సిబ్బంది డుమ్మాలు కొడుతూ విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డాక్టర్ సంగారెడ్డి హెచ్చరించారు. గురువారం ఖేడ్ ఏరియా ఆస్పత్రి సిబ్బంది విధుల నిర్వహణపై విచారణ జరిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి బుధవారం ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేయగా.. డుమ్మాల విషయం వెలుగుచూసింది. స్పందించిన డీసీహెచ్ఎస్.. ఆస్పత్రిలో విభాగాల వారీగా విచారణ జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డెలివరీ కేసులు, ఇతర రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేయడం, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం, గైర్హాజరు తదితర అంశాలపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తానని తెలిపారు. ఆస్పత్రిలో గురువారం నుంచే బయోమెట్రిక్‌ను అమలు చేస్తున్నామని, దాని ఆధారంగానే వేతనాలు చెల్లిస్తామని వెల్లడించారు. పలు పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత ఉన్నందున ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ల్యాబ్ టెక్నీషియన్ డి.రమేష్‌ను సిర్గాపూర్ పీహెచ్‌సీకి, ఫార్మాసిస్ట్ నాగ్‌నాథ్‌ను నిజాంపేట్ పీహెచ్‌సీకి డిప్యూటేషన్ వేసినట్లు వివరించారు. ఆస్పత్రిలో మందుల కొరతను ఆయన దృష్టికి తేవడంతో ఇండెంట్ పెట్టామని, త్వరలో వస్తాయని చెప్పారు. విచారణలో ఆస్పత్రి సూపరింటిండెంట్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



ఆస్పత్రిలో విచారణ జరుపుతున్న డీసీహెచ్ఎస్ సంగారెడ్డి

గ్రూప్-1 అధికారి కావాలనుకొని
గురువునయ్యా



టర్నింగ్ పాయింట్

- నాన్న మరణంతో ఉద్యోగం తప్పనిసరైంది
- టీచింగ్‌ను ప్యాషన్‌గా భావిస్తా..
- డీఈఓ ధన్నాలకోట రాధాకిషన్

నిరుపేద రైతు కుటుంబంలో జన్మించి కానిగి చదువులతో అక్షరాభ్యాసం ప్రారంభించారు. తండ్రి మరణంతో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. గ్రూప్–1 అధికారి కావాలనుకొని గురువుగా మారారు. ప్రభుత్వ పాఠశాలలకు రథసారథిగా.. జిల్లా విద్యాశాఖకు మార్గదర్శిగా నిలుస్తూ.. లక్షలాది విద్యార్థుల జీవితాల్లో జ్ఞాన జ్యోతులు వెలిగిస్తున్నారు. ఆయనే మెదక్ డీఈఓ రాధాకిషన్. తన జీవన గమనాన్ని మలుపు తిప్పిన 'టర్నింగ్ పాయింట్'పై సాక్షితో పంచుకున్న అనుభవ మాలిక ఆయన మాటల్లోనే..

– పాపన్నపేట(మెదక్)

నిరుపేద కుటుంబంలో వెలుగు కిరణమై

కరీంనగర్ జిల్లా మెట్‌పల్లి నా పురిటి గడ్డ. ధన్నాలకోట భూలక్ష్మి, కొండయ్య దంపతులు మా అమ్మానాన్నలు. మేము ముగ్గురం. అన్న గంగాధర్, తమ్ముడు విజయ్‌కుమార్. ఉన్న కొద్దిపాటి పొలమే మా జీవనాధారం. అన్నయ్య ప్రైవేట్ కరెంట్ పనులు చేస్తుండగా, తమ్ముడు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్నారు.

కానిగి చదువులతో ప్రారంభమై..

అప్పట్లో మా ఊరిలో జిల్లా లక్ష్మీనారాయణ అనే పంతులు కానిగి (ప్రైవేట్) బడి నడిపేవారు. మా నాన్న నెలకు రూ.1.25 ఇచ్చి మాకు చదువు చెప్పించారు. 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు మెట్‌పల్లిలోని ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలలో చదివాను. జగిత్యాలలోని ఎస్‌కేఎన్‌ఆర్ కాలేజీలో డిగ్రీ, ఉస్మానియాలో పీజీ, కరీంనగర్‌లో బీఈడీ పూర్తి చేశారు. కాలేజీ స్థాయి నుంచి ఎన్‌సీసీ కేడెట్‌ను, సీ సర్టిఫికెట్ హోల్డర్‌ను. క్రమశిక్షణ, దేశభక్తి, త్యాగనిరతి, సేవాభావం ఎన్‌సీసీ నేర్పింది. చిన్నప్పటి నుంచి కబడ్డీ అంటే ఇష్టం.

నాన్న మరణంతో ఇబ్బందులు

చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండే నేను గ్రూప్–1 అధికారి కావాలనుకొని మెయిన్స్ వరకు వెళ్లా. అప్పుడే నాన్న మరణంతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఉద్యోగం తప్పనిసరి అయింది. దీంతో బీఈడీ పూర్తి చేశా. డీఎస్సీ రాసి 1988లో ఆదిలాబాద్‌లోని రాయగూడ (ఇచ్చోడ) పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందా.

ప్రత్యేక తెలంగాణలో డీఈఓగా..

స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన నేను 1992లో డైట్ లెక్చరర్‌గా, 2006లో బీఈడీ కళాశాల లెక్చరర్‌గా, 2010లో డీఎస్ఈ స్టాటిస్టికల్ ఆఫీసర్, 2018లో ఎస్ఈఆర్టీ ప్రొఫెసర్‌గా ప్రమోషన్లు పొందా. తెలంగాణ రాష్ట్రం అవతరించిన తర్వాత సిరిసిల్ల జిల్లా విద్యాశాఖాధికారిగా, 2023లో మెదక్ డీఈఓగా పదవీ బాధ్యతలు స్వీకరించా.

అందమైన జీవితం

భార్య, ఇద్దరు పిల్లలు నా అందమైన జీవితానికి మూలకర్తలు. కూతురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా, కొడుకు సివిల్ ఇంజినీర్‌గా జీవితంలో స్థిరపడ్డారు. కుటుంబానికి తగిన ప్రాధాన్యం ఇస్తూనే, అదేస్థాయిలో ఉద్యోగ ధర్మాన్ని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నా.



గతేడాది బెస్ట్ అడ్మినిస్ట్రేటర్ అవార్డు తీసుకుంటున్న డీఈఓ రాధాకిషన్

అవార్డు బాధ్యతను పెంచింది

గతేడాది నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ వారు నాకు ఇచ్చిన బెస్ట్ అడ్మినిస్ట్రేటర్ అవార్డు బాధ్యతను మరింత పెంచింది. అదే స్ఫూర్తితో విద్యారంగంలో జిల్లా కీర్తిని చాటేందుకు మరింత కృషి చేస్తా. కలెక్టర్, టీచర్లు, యూనియన్ నాయకుల సహకారంతో మెతుకు సీమను మెరిపిస్తా.

ఆ సంఘటన మరిచి పోలేను

సిరిసిల్ల జిల్లాలో డీఈఓగా పని చేసేటప్పుడు అన్ని ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టిన సంఘటన మరిచిపోలేను. రాష్ట్రంలోనే ఇది మొదటి జిల్లా కావడం విశేషం. అప్పటివరకు ప్రైవేట్ బడులు, డబ్బులున్న వారికే పరిమితమైన ఆంగ్ల మాధ్యమం నిరుపేద విద్యార్థులకు సైతం అందుబాటులోకి వచ్చింది. ఇందుకు అప్పటి మంత్రి కేటీఆర్, ఎంఈఓ రాజయ్య అందించిన సహకారం అభినందనీయం. ఇది నా జీవితంలో మరిచిపోలేని సంఘటన.

బోధకుడిగా ఉండటమే ఇష్టం

టీచింగ్‌ను ఉద్యోగంలా కాకుండా.. ప్యాషన్‌గా భావిస్తా. విజ్ఞాన దీపం చేత బట్టి, విద్యార్థులను వెలుగు కిరణాలుగా మార్చి విశ్వంలోకి పంపే శక్తి ఒక ఉపాధ్యాయుడికే ఉంది. అందుకే అధికారిగా కన్నా బోధకుడిగా ఉండడానికే ఇష్టపడతా.

క్లుప్తంగా

అదుపుతప్పి పల్టీలు కొట్టిన కారు

ప్రాణాలతో బయటపడ్డ ముగ్గురు


ఘటనా స్థలంలో కారు

వట్‌పల్లి(అందోల్‌): అదుపు తప్పి కారు పల్టీలు కొట్టగా అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన అందోలు మండల పరిధిలోని రాం సాన్‌పల్లి గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. హైదరాబాద్‌ నుంచి నారాయణఖేడ్‌ వైపు వెళ్తున్న కారు రాంసాన్‌పల్లి శివారులోకి రాగానే నాందేడ్‌- అకోలా జాతీయ రహదారిపై అదుపు తప్పింది. పల్టీలు కొట్టి రోడ్డు డివైడర్‌ కాల్వలో పడిపోయింది. ఈ ప్రమాద ఘటనను తీవ్రతను చూసి అందరూ కారులో ఉన్నవారు చనిపోయి ఉంటారని భావించారు. వెంటనే కారు వద్దరు వెళ్లి చూడగా కారులోని ముగ్గురు వ్యక్తులు ఎటువంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. క్రేన్‌ సాయంతో కారును పక్కకు తీసి మరో వాహనంలో తీసుకెళ్లారు.

కలిసిమెలిసి.. కలుపు తీసి


పత్తి మొక్క

జిల్లాలో ఎక్కడ చూసినా పంట పొలాలలో రైతులు, కూలీలు బిజీబిజీగా కనిపిస్తున్నారు. అడపాదడప కురిసిన వర్షాలకు పత్తి విత్తనాలు నాటారు. అవి ప్రస్తుతం మొలకెత్తి పచ్చగా కళకళలాడుతున్నాయి. దీంతో పత్తి మొక్క చుట్టూ పెరిగిన కలుపును తీసే పనిలో మహిళా కూలీలు నిమగ్నమయ్యారు. అందరూ కలిసి పాటలు పాడుతూ పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో మధ్యమధ్యలో నీళ్ల తాగుతూ నీడలో సేద తీరుతున్నారు.

–సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి


ఎండ తట్టుకోలేక నీళ్లు తాగుతున్న కూలీలు


సదాశివపేట మండలం పెద్దాపూర్‌ పరిధిలో పత్తి చేనులో కలుపు తీస్తున్న మహిళలు


పచ్చగా కళకళలాడుతున్న పత్తి చేను

డైట్‌.. ఫ్యూచర్‌ డౌట్‌

వేధిస్తున్న లెక్చరర్ల కొరత

- 33 మందికి ఇద్దరే సిబ్బంది
- ఇందులోనూ ఒకరు ప్రిన్సిపాల్, మరొకరు లెక్చరర్‌
- తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలకు కలిపి 30 సబ్జెక్టులు
- కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి

గురువు లేని విద్యా గుడ్డి విద్య అన్న చందంగా మారింది డైట్‌ విద్యార్థుల పరిస్థితి. రేపటి భవిష్యత్‌ తరాలను తీర్చిదిద్దే కాబోయే గురువులకు చదువు చెప్పేందుకు లెక్చరర్లు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెదక్‌ ఉమ్మడి జిల్లాలో ఏకైక డిస్ట్రిక్ట్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఎడ్యుకేషన్‌ అండ్‌ ట్రైనింగ్‌(డైట్‌) కళాశాల ఉంది. ఇందులో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలు ఉన్నాయి. ఒక్కో మీడియానికి 10 సబ్జెక్టుల చొప్పున 30 సబ్జెక్టులు ఉంటాయి. సబ్జెక్ట్‌కు ఒక్క లెక్చరర్‌తోపాటు ప్రిన్స్‌పాల్‌ మరో ఇద్దరు అదనపు సిబ్బంది మొత్తం 33 మంది సిబ్బంది ఉండాలి. కానీ ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఉన్నారు. దీంతో విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు.

– మెదక్‌జోన్‌



మెదక్‌లోని డైట్‌ కళాశాల

మెదక్‌ జిల్లాలోని ఏకై క డైట్‌ కళాశాలలో ప్రస్తుతం ఒకరు ప్రిన్స్‌పాల్‌ కాగా మరొకరు లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ లెక్కన 31 లెక్చరర్ల పోస్టులు ఖాళీలుగా ఉన్నాయి. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. గతంలో రిటర్మెంట్‌ అయిన ఉపాధ్యాయులను గెస్ట్‌ ఫ్యాకల్టీగా తాత్కాలిక పద్ధతిన తీసుకున్నారు. వారికి అప్పట్లో నెలల తరబడి వేతనాలు రాలేదు. దీంతో ఆ తర్వాతి సంవత్సరం నుంచి బోధించేందుకు రావడం లేదు.

విద్యార్థులే ఉపాధ్యాయుల అవతారం

డైట్‌లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు రెండేళ్ల కోర్సు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలో ఫస్టియర్, సెకండియర్‌ చదివే విద్యార్థుల్లో ఫస్టియర్‌ చదివే అభ్యర్థులు 30 రోజులు, సెకండియర్‌ చదివే అభ్యర్థులు 30 రోజులపాటు ఒక్కొక్కరు 60 రోజుల పాటు ప్రభుత్వ బడుల్లో పాఠాలు బోధించాల్సి ఉంటుంది. కానీ వీరికి బోధించేందుకు లెక్చరర్లు లేకపోయినా విద్యార్థులే వంతుల వారీగా ఉపాధ్యాయులుగా అవతారం ఎత్తి తోటి విద్యార్థులకు సందేహాలను నివృత్తి చేస్తూ పాఠాలు చెబుతున్నారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియం అభ్యర్థులందరినీ ఒకే గదిలో కూర్చోబెడుతున్నారు. మెదక్‌లో ఎమ్మెస్సీ. ఎంఈడీ చదివిన నలుగురు నిరుద్యోగులను గుర్తించిన డైట్‌ ప్రిన్స్‌పాల్‌ రమేశ్‌బాబు వారితో నిత్యం రెండు, మూడు గంటల పాటు చదువు చెప్పిస్తున్నారు.

కళాశాలకు తాళం పడనుందా?

తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంకు సంబంధించి మొత్తం 300 సీట్లు ఉండగా సుమారు 200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా కొనసాగే రమేశ్‌ బాబుది మెదక్‌ లోకల్‌. రెండు దశాబ్దాలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. లెక్చరర్ల కొరత తీర్చడానికి ఆయన చేయని ప్రయత్నం అంటూ లేదు. ప్రతీ ఏటా డీఈవో, కలెక్టర్‌ను కలిసి కాలేజీ పరిస్థితి వివరించి డైట్‌ అభ్యర్థులకు చదువు చెప్పే అర్హత గల ఎంఈడీ చేసిన టీచర్లను గుర్తించి డిప్యూటేషన్‌ వేయించుకొని కాలేజీని రన్‌ చేస్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో రమేశ్‌బాబు రిటైర్మెంట్‌ ఉంది. దీంతో డైట్‌కు తాళం పడటం ఖాయమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వంతుల వారీగా చెబుతున్నాం



మాకు లెక్చరర్లు లేకపోవడంతో మాకు మేమే చదువులు చెప్పుకుంటున్నాం. ఫ్యాకల్టీని ఇవ్వాలని ప్రతీఏటా ఉన్నతాధికారులకు అర్జీలు పెడుతూనే ఉన్నాం. కానీ ఫలితం లేకపోవడంతో వంతుల వారీగా చదువులు చెప్పుకుంటున్నాం.

– అమూల్య, డైట్‌ సెకండియర్‌ విద్యార్థి

ప్రిన్సిపాల్‌ పిలిస్తే వచ్చా..



నేను ఎంఏ సైకాలజీ, ఎంఈడీ, ఎంఫిల్‌ చదివాను. ప్రస్తుతం ఖాళీగా ఉండటంతో ప్రిన్సిపాల్‌ రమేశ్‌బాబు కోరిక మేరకు వచ్చి చదువు చెబుతున్నాను. ప్రభుత్వం నుంచి జీతం వస్తే ఇస్తామన్నారు.

– విఠల్, నిరుద్యోగి

డీఈఓకు అర్జీ పెట్టాం



చాలా కాలంగా డైట్‌లో లెక్చరర్లు లేరు. ప్రతీ ఏటా ఏదో విధంగా పాఠాలు చెప్పించే ప్రయత్నం చేస్తున్నాను. విద్యార్థులకు బోధించేందుకు అర్హులైన ఉపాధ్యాయులు కొందరిని డిప్యూటేషన్‌పై ఇవ్వాలని డీఈఓకు అర్జీ పెట్టాను.

– రమేశ్‌బాబు, డైట్‌ కళాశాల ప్రిన్సిపాల్‌

ఫుడ్‌ సేఫ్టీపై నిర్లక్ష్యం వద్దు

ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ ధర్మేందర్‌


ఫుడ్‌ను పరిశీలిస్తున్న ధర్మేందర్‌

పటాన్‌చెరు: ఫుడ్‌ సేఫ్టీ పై నిర్లక్ష్యం వద్దని, కల్తీ చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా గెజిటెడ్‌ ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ ధర్మేందర్‌ అన్నారు. గురువారం పటాన్‌చెరు మండలం రుద్రారం, గ్రామ పరిధిలోని శ్రీ వశిష్ట ఎడ్యుకేషనల్‌ ట్రస్ట్‌ (శ్రీ చైతన్య జూనియర్‌ కళాశాల)లోని క్యాంటీన్‌ను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధర్మేందర్‌ మాట్లాడుతూ.. నాసిరకం ఆహార పదార్థలను, తేదీ ముగిసిన ఆహార పదార్థాలను ప్రజలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, ఇతర ఆహార వ్యాపారులను హెచ్చరించారు. జిల్లా మంత్రి, కమిషనర్‌ ఫుడ్‌ సేఫ్టీ, కలెక్టర్‌ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వశిష్ట ఎడ్యుకేషనల్‌ ట్రస్ట్‌లో 50 కిలోల 6బాగులు ఇడ్లీ రవ్వ గడువు తీరి ఉండటం, యాలకులు, జాపత్రి కస్తూరి మేతి లేబుల్‌ లేకుండా ఉండటం, పరిశుభ్రత లేకపోవడం గుర్తించామన్నారు. నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. సేకరించిన నమూనాలను ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో చోటు చేసుకుంది. హద్నూర్‌ ఎస్‌ఐ రామానాయుడు కథనం మేరకు.. పుల్‌కల్‌ మండల పరిధిలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన రాంరెడ్డి(47) తరచూ మద్యం సేవించేవాడు. ఈనెల 23వ తేదీన న్యాల్‌కల్‌లో ఉంటున్న ముంగి గ్రామానికి చెందిన అత్తగారి ఇంటికొచ్చాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉండటంతో చికిత్స నిమిత్తం ఈ నెల 25న బీదర్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బుధవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. సమీపంలో గల పొలంలో ఉన్న వేప చెట్టుకు ఉరి వేసుకొని హత్యకు పాల్పడ్డాడు. తరుచూ మద్యం సేవించే రాంరెడ్డి ఒక్కసారిగా మానుకోవడంతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.


సిబ్బందిని బంధించిన రైతులు

పాల కేంద్రంలో సిబ్బంది నిర్బంధం

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): పాల బిల్లు రూ.7 తగ్గించారని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ మండలంలోని బస్వాపూర్‌ గ్రామంలో కరీంనగర్‌ పాల డెయిరీ సూపర్‌వైజర్‌ కర్ణాకర్‌రెడ్డి, సిబ్బందిని ఉత్పత్తి దారులు పాలకేంద్రంలో వేసి తాళం వేసి బంధించారు. ఈ సందర్భంగా పాడి రైతులు మాట్లాడుతూ.. ఇతర డెయిరీ పాల కంటే తగ్గించి ఇవ్వడం సరికాదన్నారు. వెంటనే బిల్లు రేటు పెంచి గిట్టుబాటు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

రెండు బైక్‌లు ఢీ

యువకుడి మృతి

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): రెండు బైక్‌లు ఢీ కొని యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని హుస్సెన్‌ గ్రామ సమీపంలో చోటు చేసుకొంది. హద్నూర్‌ ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం.. కర్నాటక ప్రాంతం అల్మాస్‌పూర్‌ గ్రామానికి చెందిన రాకేశ్‌(20) ఈనెల 26న న్యాల్‌కల్‌ మండల పరిధిలోని హుస్సెన్‌లో చికెన్‌ కొనేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. గ్రామంలో చికెన్‌ కొనుగోలు చేసి తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాల పాలైన రాకేశ్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామానాయుడు వివరించాడు.

ఫోన్‌ చోరీ చేసి.. నగదు కాజేసి

ఓ బాధితుడి ఖాతా నుంచి రూ.1.08 లక్షలు అపహరణ

పటాన్‌చెరు టౌన్‌ : బస్టాండ్‌లో ఫోన్‌ చోరీ చేసి నంబర్‌ ఆధారంగా నగదు కాజేసిన ఘటన పటాన్‌ చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నర్సాపూర్‌ మండలం ఇబ్రహీంబాద్‌ గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి ఫోన్‌ను పటాన్‌ చెరు బస్టాండ్‌లో ఈనెల 1 వ తేదీన గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. బాధితుడు ఫోన్‌కు లాక్‌ పెట్టుకోకుండా బ్యాంకు ఖాతా వివరాలు సైతం అందులోనే ఉంచుకున్నాడు. ఈ క్రమంలో దొంగలు చోరీ గురైన ఫోన్‌లోని సిమ్‌ ఆధారంగా అదే రోజు రూ.3 వేలు, ఆ తర్వాత రూ.5 వేలు అనంతరం రెండు దఫాలుగా రూ. లక్ష నగదును ఖాతా నుంచి కాజేశారు. బాధితుడు విషయం తెలుసుకొని ముందుగా సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాచగిరికి రూ.17.95 లక్షల ఆదాయం

వివిధ టెండర్ల కోసం వేలం పాట నిర్వహణ


వేలంపాట నిర్వహిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

వర్గల్‌(గజ్వేల్‌): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరిలో శుక్రవారం వివిధ టెండర్ల కోసం నిర్వహించిన వేలం పాటల ద్వారా దేవస్థానానికి రూ. 17,95,000 ఆదాయం సమకూరింది. గతేడాది రూ.15,66,000లు కాగా, ఈసారి రూ.2,29,000 అదనపు ఆదాయం లభించింది. ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్‌ శివరాజ్, ఆలయ ఈఓ అన్నపూర్ణ పర్యవేక్షణలో క్షేత్రం వద్ద వేలం పాటల ప్రక్రియ నిర్వహించారు. కొబ్బరి కాయలు, పూజ సామగ్రి అమ్ముకోవడానికి, టెంటు సామగ్రి, శాలువాలు, చీరలు తక్కువ ధరకు సరఫరా, తలనీలాలు, ధోతులు, ఒడి బియ్యం, పాదరక్షలు, కంకణాలు, వెండి, రాగి డాలర్లు తదితరాల కోసం వేలంపాట నిర్వహించినట్లు ఈఓ అన్నపూర్ణ తెలిపారు. టెంటు సామగ్రి వేలం పాటకు రూ. 8,50,000, తలనీలాలు పోగు చేసుకోవడానికి రూ.4,30,000, స్వామివారికి సమర్పించిన చీరలు, ధోతులు పోగు చేసుకోవడానికి రూ.3,90,000, పాదరక్షల కోసం వేలంలో రూ.1,25,000 ఆదాయం లభించిందన్నారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి టెండర్‌ వేలంలో, ఒడిబియ్యం పోగు చేసుకోవడానికి టెండర్‌ వేలంలో ఎవరూ పాల్గొనకపోవడంతో రద్దు చేసినట్లు వివరించారు.

నిద్రిస్తున్న వ్యక్తి పైనుంచి వెళ్లిన జేసీబీ

అక్కడికక్కడే మృతి

చేర్యాల(సిద్దిపేట): నిద్రిస్తున్న వ్యక్తి తలపై నుంచి జేసీబీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని పాత దొమ్మాట శివారు చెరువుకట్ట వద్ద చోటుచేసుకుంది. స్థానికులు, ఎస్‌ఐ దామోదర్‌ కథనం మేరకు.. మండల పరిధిలోని అర్జునపట్ల గ్రామంలోని సింప్లీ ఫ్రెష్‌ కంపెనీలో పనిచేసే పశ్చిమబెంగాల్‌ రాష్ట్రానికి చెందిన కొందరు వ్యక్తులు చెరువు సమీపంలో ఉంటున్నారు. వారికి వంట పనులు చేసే గోపాల్‌ సర్దార్‌(49) అనే వ్యక్తి ఒంట్లో బాగోలేదని గురువారం ఉదయం చెరువు కట్ట సమీపంలో చెట్టు కింద పడుకున్నాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న జేసీబీ డ్రైవర్‌ అజాగ్రత్తగా, అతి వేగంగా జేసీబీ నడిపి నిద్రపోతున్న గోపాల్‌ సర్దార్‌ తలపైకి ఎక్కించాడు. దీంతో గోపాల్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయమై తోటి వ్యక్తి బపన్‌ సర్దార్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వరి సాగులో నారుమడే కీలకం

- విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి
- సస్యరక్షణ చర్యలు పాటించాలి
- వ్యవసాయ అధికారి సూచనలు, సలహాలు


ఏఓ వసంతరావు


వరి నారుమడి

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): వరిసాగులో నారుమడి యాజమాన్యం కీలకమైంది. నారు బాగుంటేనే పంట బాగుంటుంది. విత్తనాల ఎంపిక నుంచి నారుమడి దశ వరకు జాగ్రత్తలు తీసుకుంటే వరి సాగులో ప్రధాన సమస్యలు ధరిచేరవని మండల వ్యవసాయాధికారి వసంతరావు సలహాలు, సూచనలు..

- నీటి వసతి, ప్రాంతాన్ని బట్టి చీడ పీడలను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవాలి. ఆరోగ్యవంతమైన పొలం నుంచి సేకరించిన వడ్ల గింజలనే వాడాలి. అధీకృత డీలర్ల వద్ద సరైన రసీదుతో విత్తనాలు కొనుగోలు చేయాలి.
- ఎంపిక చేసిన రకాల కాల పరిమితిని బట్టి నిరీత సమయంలో నారు చేసుకోవాలి.
- దీర్ఘకాలిక రకాలు (140 రోజుల కన్న ఎక్కువ) జూన్‌ 20 వరకు, మధ్య స్వల్పకాలిక రకాలు (110 నుంచి 135 రోజులు) జూలై 15 వరకు స్వల్పకాలిక రకాలు జూలై చివరి వరకు నారు పోసుకోవచ్చు.
- ఎకరాల వరి సాగుకు సన్నరకం 20 కిలోలు, దొడ్డురకం 25 కిలోలు సరిపోతాయి.
- నాటే ముందు మొలక శాతాన్ని పరీక్షించాలి. నీరు పెట్టడానికి తీయడానికి వీలుగా కాల్వలతో కూడిన ఎత్తయిన నారుమడులు చేసుకోవాలి.
- గింజలు నానబెట్టడానికి వాడే గోనె సంచి కొంచెం పెద్దగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడు తేజమైన మొలక వస్తుంది.
- నారుమడి దున్నేటప్పుడు 250 కిలోల పశువుల ఎరువు ప్రతీ రెండు గుంటలకు వేయాలి. విత్తన శుద్ధి విధిగా చేయాలి. పొడి విత్తన శుద్ధికి కిలో విత్తనానికి మూడు గ్రాముల కార్బెండజిమ్‌ కలిపి 24 గంటల తర్వాత చల్లాలి.
- రెండు గుంటల నారుమడిలో రెండు కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్‌ ఇచ్చే ఎరువులను విత్తేముందు సగం విత్తిన 15 రోజులకు సగం వేయాలి. భాస్వరం, పొటాష్‌ విత్తేముందు వేయాలి.
- దుంప నారుమడికైతే లీటర్‌ నీటిలో కిలో విత్తనానికి ఒక గ్రాము, కార్బెండజీమ్‌ లీటర్‌ మొలక కట్టిన విత్తనాన్ని నారుమడిలో పలచగా సమానంగా చల్లాలి.
- చిక్కగా అలికిన నారు సన్నగా పెరగడంతో నాటే సమయంలో ఒకే కుదురుకు 5.6 మొక్కలు పెట్టే అవకాశం ఉంటుంది.
- తొలిదశలో కలుపు నివారణకు విత్తనం చల్లిన వారం రోజులకు రెండు గుంటల నారు మడికి ప్రిటిలో క్లోర్‌ సేవనర్‌ 25 మిల్లీ లీటర్లు లేదా బ్యూటోక్లోర్‌ 50 మిల్లీ లీటర్లు లేదా పైరజో సల్ఫ్యూరాన్‌ 5 గ్రాములు 5 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఊడ ఒడిపిరి ఉంటే అవసరాన్ని బట్టి 15 నుంచి 20 రోజులకు బ్యూటైల్‌ 15 మిల్లీ లీటర్లు 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- నారుమడి చుట్టూ గట్ల మీద చీడ పీడలకు ఆశ్రయం ఇచ్చే తుంగ, చిప్పెర, గరిక ఊసలాంటి కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. అగ్గి తెగులు బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- నారుమడిలో నారు తీయడానికి వారం రోజుల ముందు రెండు గుంటల నారుమడికి 800 గ్రాములు, కార్బోఫ్యూరాన్‌ గులికలు ఇసుకలో కలిపి చల్లి పల్చగా నీరు పెట్టాలి. తద్వారా ఉల్లికోడు కాండం తొలుచు పురుగును నివారించవచ్చు.